మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు తదితరులు

మర్రికి పరామర్శ..

జంగిరెడ్డికి నివాళులర్పించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

తిమ్మాజిపేట, డిసెంబర్ 30 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని పలువురు పరామర్శించారు. సోమవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో జంగిరెడ్డి ఏకాదశ దిన కర్మకు రాజ్యసభ సభ్యులు, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, వద్ది రాజు రవిచంద్ర, పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాగం జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్, అంజయ్య యాదవ్‌తోపాటు జాజాల సురేందర్, మాజీ ఎంపీ రాములు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

చెస్ చాంపియన్ పట్లోళ్ల ఇంద్రారెడ్డి

సత్తా చాటిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మనవడు

వెంగళరావునగర్, డిసెంబర్ 30: ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్ -11 బాలుర విభాగంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మనవడు, కార్తీక్ రెడ్డి, విశాలి స్రవంతిల కుమారుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి చాంపియన్‌గా నిలిచాడు. జూబ్లీ హిల్స్‌లోని రోడ్డు నం.11లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు వెల్లడించారు. కాన్పూర్‌లో గతవారం క్రిష్ణ గోపాల్ కపూర్ మెమోరియల్ ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఐదు రోజుల పాటు జరిగింది. ఈ టోర్నమెంట్‌లో అకాడమీకి చెందిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అండర్-11 బాలుర విభాగంలో ఇంద్రారెడ్డి చాంపియన్‌గా నిలిచాడని, ఓపెన్ కేటగిరీలో అన్ని గేమ్స్ విజేతగా నిలిచి భరత్ కుమార్ రెడ్డి లక్ష రూపాయల ప్రైజ్‌ని గెలిచాడని తెలిపారు. పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఫిడే రేటింగ్స్ తన పాయింట్స్‌ను మెరుగుపర్చుకున్నాడని సందీప్ నాయుడు తెలిపారు. గ్రాండ్ మాస్టర్స్ అవ్వడమే తమ లక్ష్యమని విజేతలు పేర్కొన్నారు.

చెస్ పోటీల్లో గెలుచుకున్న జ్ఞాపికను చూపుతున్న పట్లోళ్ల ఇంద్రారెడ్డి

రోడ్ సేఫ్టీపై అవగాహన తప్పనిసరి

డాక్టర్ గురువారెడ్డి

బేగంపేట్, డిసెంబర్ 30: సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న 59 లక్షల పాఠశాలల విద్యార్థులకు రోడ్ సేఫ్టీ మార్గదర్శకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ సర్వేజనా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గురువారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 41వేల పాఠశాలలను ఎడ్యుకేట్ చేయాలనే సామాజిక సేవా దృక్పథంతో స్టాప్ రోడ్ యాక్సిడెంట్ పేరుతో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. సోమవారం సన్‌షైన్ ఆసుపత్రిలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాహనాల సంఖ్యలో ఒక శాతం మాత్రమే భారతదేశంలో ఉంటే.. కానీ, రోడ్డు ప్రమాదాలు మాత్రం 11 శాతం జరుగుతున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్, విద్యార్థులకు, డ్రైవర్‌లకు, ఇతరులకు, అలాగే ఇంజినీరింగ్ స్కిల్స్ రోడ్ల నిర్మాణం ఎక్కడ మలుపు ఉండాలి, ఎంత మేర ఉండాలనే దానిపై అవగాహన లేకపోవడం వల్లేనని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ఎమర్జెన్సీ కేర్ గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లకపోవడం, ఈ మూడు కారణాల వల్ల దేశంలో ప్రతి యేటా ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే సుమారుగా 1.50 వేల మరణాలు సంభవిస్తున్నట్టు అంచనా అని తెలిపారు. రోడ్డు సేఫ్టీ యాక్సిడెంట్ థీమ్‌ను ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే అన్ని పాఠశాలలకు స్టాప్ రోడ్ యాక్సిడెంట్‌పై క్విజ్, ఎస్సే రైటింగ్, డ్రాయింగ్, స్లోగన్, సిగ్నల్స్‌తో కూడిన అంశాలతో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై సత్వరమే స్పందించి పరిష్కారం పై చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ సమర్పించిన వినతులను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి లతో కలిసి కమిషనర్ స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్ అర్జీలపై వారం వారం సమీక్షిస్తానని, సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలకు వెనుకాడవద్దని కమిషనర్ సీసీపీకి ఆదేశాలు జారీ చేశారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు వచ్చాయి. ప్రజావాణిలో 48 ఫిర్యాదులు వచ్చాయి. కాగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 82 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, సరోజ, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సీపీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాశ్, వాటర్ వర్క్స్ డీజీఎం సాయి రమణ, హౌసింగ్ ఈ ఈ పి.వి రమణ, రాజేశ్వర్ రావు, యు.బి.డి డైరెక్టర్ శ్రీనివాస రావు, పుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ మూర్తి రాజు, సీఎంహెచ్ఓ డా.పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, డిప్యూటీ సీఈఓ పనస రెడ్డి, రెవెన్యూ జేసీ మహేశ్ కులకర్ణి, యూసీడీ జేసీ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇండ్ల కోసం అత్యధిక ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి 1630 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా 1571 దరఖాస్తులు ఇండ్ల కోసం వచ్చాయని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, పి. ముకుంద రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

కబ్జాదారులకు కోట్లలో అద్దెలు

దేవాదాయ భూముల పరిరక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆక్రమించిన భూముల్లో వెలసిన వాణిజ్య సముదాయాలు

త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ భూముల పరిశీలన

కబ్జాలతో పాటు అక్రమ నిర్మాణాలు

భూముల పరిరక్షణకు చర్యలు శూన్యం

కబ్జాలను పట్టించుకోని అధికారులు

తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవాదాయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న గోదాం (ఫైల్)

మేడ్చల్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా దేవాదాయ భూముల పరిశీలనకు అధికార యంత్రాంగం సిద్ధమవుతుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజల్‌లో ఉన్న 1350 ఎకరాల దేవాదాయ భూములను పరిశీలించేలా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవాదాయ శాఖ భూములు కబ్జాకు గురైన నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూములను రక్షించేందుకు త్రిసభ్య కమిటీని ఐఏఎస్ అధికారుల బృందంతో నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి దేవరయాంజల్‌లో ఉన్న 1350 ఎకరాలు దేవాదాయ శాఖ భూములేనని, ఆ భూముల్లో నిర్మించినవి అక్రమమేనని తేల్చిన విషయం విధితమే. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకునే క్రమంలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో అప్పట్లో చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇదే అదునుగా మరికొంత మంది దేవాదాయ భూములను కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. దేవరయాంజల్‌లో పురాతనమైన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఉంది. నిజాం హయాంలో ఓ భక్తుడు ఆలయానికి 1500 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చాడు. విరాళంగా అందించిన భూమి సర్వే నం.55 నుంచి 63, 639-631, 656, 657, 660-682, 686-718, 736 అయిన 1500 ఎకరాల భూమిని 1925 సంవత్సరం వరకు శ్రీ సీతారామచంద్రస్వామి పేరిట రికార్డుల్లో ఉంది. క్రమ క్రమంగా సీతారామరెడ్డి, సీతారామారావు, సీతారాములుగా మారిపోయి కబ్జాదారుల పేరిట రికార్డులకు వచ్చాయి. ఇప్పుడు ఆ భూముల్లో గోదాములు, రిసార్టులు, వాణిజ్య సముదాయాలు, నివాసాలు వెలిశాయి.

దేవాదాయ భూముల్లో వెలసిన వ్యాపార సముదాయాలు..

దేవాదాయ భూముల్లో నిర్మాణాలు చేసిన గోదాములు, రిసార్ట్‌లు, ఫంక్షన్‌హాళ్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకుని వాటికి రూ.కోట్లలో అద్దెలు వసూళ్లు చేస్తున్నారు. నిర్మించిన వాటిలో కొందరు మాత్రమే తూంకుంట మున్సిపాలిటీకి ఆస్తి పన్నులు చెల్లిస్తున్నారు. మిగతా వారు ఆస్తి పన్నులు చెల్లించకుండా, వీరితో కుమ్మక్కైన మున్సిపల్ అధికారులకు నెలల వారిగా మామూళ్లు ఇస్తూ.. కోట్లాది రూపాయలు దోచుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దేవుడి మాన్యంలో అక్రమంగా నిర్మించే వాటిపై దృష్టి పెట్టకుండా తమకు వచ్చే ఆదాయంపై అధికారులు దృష్టి పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా దేవాదాయ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దేవాదాయ భూములు, అక్రమ నిర్మాణాలను గుర్తించిన త్రిసభ్య కమిటీ నివేదిక చర్యలు తీసుకుంటే దేవాదాయ భూములు తిరిగి ఆలయానికి సొంతమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి..

త్రిసభ్య కమిటీ ముమ్మటికీ దేవాదాయ శాఖ భూములేనని నివేదిక ఇచ్చినా అక్రమంగా వెలుస్తున్న నిర్మాణాలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవలే దేవాదాయ భూముల్లో 6 నూతన గోదాములు నిర్మించినా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు కనపడుతోంది. ఇప్పటికే దేవాదాయ భూముల్లో కొన్ని ఎకరాలు కబ్జా కాగా, మిగతాది కబ్జా కాకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించండి

6వేల కిలోమీటర్ల అవగాహన యాత్ర

హైదరాబాద్‌కు చేరుకున్న బృందం

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సుధీర్ ధీర్

ఖైరతాబాద్, డిసెంబర్ 30 : హోటల్స్, మాల్స్, సినిమా థియేటర్స్.. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు ఇలా ఎక్కడికి వెళ్లినా కొన్ని చోట్ల మినహా దివ్యాంగులకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు. మెట్లు ఎక్కాలన్నా, దిగాలన్నా చివరకు వాష్ రూమ్‌కు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ప్రతి చోట తమకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ర్యాంప్‌లు నిర్మించాలని కోరుతూ ఐడియా బైట్స్ ఐటీ కంపెనీ, సంగటి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులు భారతదేశ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 15న న్యూ ఢిల్లీలో నాలుగు ప్రత్యేకంగా డిజైన్ చేసిన స్కూటర్లు, ఒక కారులో తొమ్మిది మంది బృందం బయలుదేరింది. 20 రోజుల్లో 6వేల కిలోమీటర్లు సాగనున్న ఈ యాత్రను పారా ఒలింపియన్ పద్మశ్రీ డాక్టర్ దీపా మాలిక్ ప్రారంభించారు. సవాయి మాదాపూర్, ఉజ్జయినీ, మాలేగావ్, పూణే, గోవా, మంగళూరు, త్రిసూర్, కన్యాకుమారి, ధనుష్ కోటి, పాండిచ్చేరి, తిరుపతి, కర్నూల్ మీదుగా సోమవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంగటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుధీర్ ధీర్, ఐడియాబైట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కట్టాతో కలిసి మాట్లాడారు. భారత దేశ వ్యాప్తంగా వివిధ వైకల్యాలతో కూడిన 50 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో దివ్యాంగుల కోసం పోలింగ్ స్టేషన్‌లో ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయని, అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, కంపెనీలు, కర్మాగారాలు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. జనవరి 3న న్యూ ఢిల్లీలో యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో యాత్ర బృందం సభ్యులు సౌమ్యా సూరజ్, అమీర్, సూరజ్ పీఏ, తేజ్‌పాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుతో సోమవారం ప్రత్యేకంగా భేటీ అయిన అమెరికా క్రికెట్ సంఘం చైర్మన్ వేణురెడ్డి

ఇంకుడు గుంత లేకుంటే..ట్యాంకర్ రేటు డబుల్

గత వేసవిలో 31వేల ట్రిప్పుల బుకింగ్..

పాత అనుభవాల దృష్ట్యా వేసవి కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేయండి

సమీక్షలో జలమండలి ఎండీ, ఈడీ ఆదేశాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఇంకుడు గుంతలు నిర్మించుకోకుంటే వచ్చే ఏడాది జనవరి నుంచి ట్యాంకర్ రేట్లు రెట్టింపు చేస్తామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. వేసవి కార్యాచరణకు సూక్ష్మ స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జలమండలి ఉన్నతాధికారులు, సీజీఎం, జీఎంలతో కలిసి ఎండీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. వేసవిలో సమర్థవంతంగా తాగునీటి సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత వేసవిలో డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. వేసవిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఫిబ్రవరి 15 నుంచి జూన్ 15 వరకు 120 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని వెల్లడించారు. ఒక సంవత్సరంలో ప్రధానంగా ఆరు డివిజన్లలోని 20 సెక్షన్ల నుంచి అధికంగా ట్యాంకర్లు బుక్ అయ్యాయన్నారు. గత వేసవిలో వంద కుటుంబాలు 31వేల ట్రిప్పులను బుక్ చేశారని ఎండీ వివరించారు. వారికి ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందో కారణాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు 40వేల కుటుంబాలు 70శాతం ట్యాంకర్ బుక్ చేశారని, వీరి ప్రాంగణాల్లో సర్వే చేస్తే 18వేల కుటుంబాలు మాత్రమే ఇంకుడు గుంతల నిర్మాణాలు కలిగి ఉన్నాయన్నారు. మిగిలిన వారికి నోటీసులు ఇచ్చామని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోకుంటే వచ్చే ఏడాది జనవరి నుంచి ట్యాంకర్ రేట్లు రెట్టింపు చేస్తామన్నారు. ఈ ఏడాది ట్యాంకర్లు అధికంగా బుక్ చేసుకునే ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్‌లను, డీజీఎం స్థాయిలో డివిజన్‌కు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తామని తెలిపారు. ట్రాన్స్‌మిషన్ లైన్ల మీద ఎమర్జెన్సీ, జంక్షన్ పనులు, వాల్వ్, లీకేజీ పనులు పూర్తి చేసుకోవాలని అధికారులను ఈడీ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, స్వామి, అమరేందర్ రెడ్డి, సుదర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఖరీదైన స్థలం పై కబ్జాదారుల కన్ను

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డుల తొలగింపు

ఇదే స్థలంలో ఆర్ఐతో పాటు ఎస్ఐని ఏసీబీ ట్రాప్

తప్పుడు కేసులు పెట్టిన కబ్జాదారుడి పై కేసు

మరోసారి పావులు కదుపుతున్న ఖాలిద్

బంజారాహిల్స్ రోడ్ నం.14లో ప్రభుత్వ స్థలం చుట్టూ బ్లూషీట్లపై హెచ్చరిక బోర్డులు తుడిచేసిన దృశ్యం

ప్రభుత్వ హెచ్చరిక బోర్డుపై తన స్థలం అంటూ స్టిక్కర్ వేసిన అబ్దుల్ ఖాలిద్

బంజారాహిల్స్, డిసెంబర్ 30: బంజారాహిల్స్ రోడ్ నం.14లో సుమారు రూ.100కోట్ల విలువైన ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు మరోసారి కబ్జాదారులు ప్రయత్నాలు ప్రారంభించారు. షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నం.14 ప్రధాన రహదారిపై సుమారు 4ఎకరాల స్థలంపై ఎన్నో ఏళ్లుగా కోర్టులో వివాదాలు ఉన్నాయి. బాదం రంగస్వామి అనే వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగిన వివాదంలో రెండేళ్ల క్రితం ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదే అంటూ సుప్రీంకోర్టులో తీర్పు వచ్చింది. దీంతో స్థలాన్ని స్వాధీనం చేసుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ స్థలంలో 4865 గజాల స్థలం తమదే అంటూ బోగస్ పత్రాలు సృష్టించిన సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం రంగంలోకి దిగాడు. స్థలంలోకి ప్రవేశించేందుకు యత్నించగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ స్థలాన్ని కాజేసేందుకు తనకు సహకరించాలంటూ 2020 జూన్‌లో అప్పటి షేక్‌పేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగార్జున రెడ్డికి రూ.15లక్షలు ఇచ్చి ఏసీబీ ట్రాప్ చేయించాడు. తనపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ కేసుల్లో సాయం చేస్తానని ఎస్ఐ రవీందర్ నాయక్ లంచం తీసుకున్నాడంటూ ఖాలిద్ ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు అతడిని కూడా అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తహసీల్దార్‌గా ఉన్న సుజాత ఇంటిపై ఏసీబీ అధికారులు దాడి చేయడంతో లెక్కచూపించని రూ.24 లక్షల నగదు, 6 లక్షల విలువైన బంగారం లభ్యమైంది. దీంతో ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఏసీబీ అధికారుల విచారణలో ఫోర్జరీ పత్రాలతో ఖరీదైన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించడంతో పాటు తనకు ఎవరూ అడ్డురాకుండా చూసుకోవాలనే లక్ష్యంతో సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ ప్రభుత్వ అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేసినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు సీసీఎస్‌కు ఫిర్యాదు చేయగా.. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటి నుంచి రెవెన్యూశాఖ ఆధీనంలోనే స్థలం ఉంది. కాగా గత కొన్ని రోజులుగా స్థలం పై కన్నేసిన అబ్దుల్ ఖాలిద్ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తుడిపి వేయించాడు. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన బ్లూషీట్లపై ఉన్న ప్రభుత్వ బోర్డులను నల్లరంగుతో తుడిచివేయడంతో పాటు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులపై స్థలం తనది అంటూ స్టిక్కర్లు వేయించడం గమనార్హం. గతంలోనే రెవెన్యూ, పోలీసు అధికారులను ఏసీబీ ట్రాప్ చేయించినా తన జోలికి ఎవరూ రారనే ఉద్దేశంతో మరోసారి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వంగరి శ్రీతేజకు సత్కారం



వంగరి శ్రీతేజను సత్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 30: మిస్ సౌత్ ఇండియా-2024 ప్రైడ్ టైటిల్‌ను సొంతం చేసుకున్న వంగరి శ్రీతేజను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సత్కరించారు. సోమవారం ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలోని ఆమె నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మిస్ యూనివర్స్-25లో ప్రపంచ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరారు. ముషీరాబాద్‌కు చెందిన యువతి మిస్ సౌత్ ఇండియా-24 ప్రైడ్ టైటిల్‌ను సొంతం చేసుకోవడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్, దీన్‌దయాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు.

ప్రజ్ఞాశీలి కట్టమంచి రామలింగారెడ్డి

మాట్లాడుతున్న శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ముషీరాబాద్, డిసెంబర్ 30: సాహిత్య, విద్యా రంగాల్లో ప్రజ్ఞాశీలి కట్టమంచి రామలింగారెడ్డి అని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపరలో భాగంగా సోమవారం సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కట్టమంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కట్టమంచి వారిది విశిష్ట శైలి అని, 19 ఏళ్ల వయస్సులోనే ఖండ కావ్యం, ముసలమ్మ మరణం రచించి నాటి సాహితీవేత్తల మన్ననలు అందుకున్నారని తెలిపారు. తన రచనల ద్వారా అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్ర మూర్తి, కళా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): వెబ్ డిజైనింగ్, అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్, హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్ తదితర 19 కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించేందుకు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సోమవారం వెల్లడించింది. జనవరి 2 నుంచి 4 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపింది. ఆధార్, వార్షిక ఆదాయ సర్టిఫికెట్, రెండు ఫొటోలతో నాంపల్లిలోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించింది.